క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

కొడంగల్: ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి ఆదివారం నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు మండల పరిధిలోని కస్తూరుపల్లి గ్రామంలో లొంక బసవన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి జాతరలో పాల్గొంటారు. అనంతరం మద్దూరు మండలం నాగిరెడ్డిపల్లి గ్రామంలో సిద్దేశ్వరస్వామి జాతరలో పాల్గొననున్నారు. చెన్వార్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. కోస్గి మండలం పీసీ తండాలో రామలింగేశ్వర స్వామి జాతర, కోస్గిలో ఛత్రపతి జయంతిలో పాల్గొంటారు. సాయంత్రం 5 గంటలకు కొడంగల్ పట్టణంలో శివాజీ శోభాయాత్రలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ సిబ్బంది తెలిపారు.

అన్నదానం నేడు

కొడంగల్: మహాశివరాత్రిని పురస్కరించుకొని ప్రాచీన ఆలయంగా పేరుగాంచిన గాడిబాయి శివాలయంలో ఆదివారం (నేడు) ఉదయం 9 గంటలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని అర్చకుడు కిట్టుస్వామి కోరారు. ఉపవాస దీక్షలు చేసిన భక్తులు దేవుని సన్నిధిలో దీక్ష విరమించాలని చెప్పారు.

పండగ పూట పండ్లు పిరం



పండ్ల దుకాణాలు

మర్పల్లి: మహాశివరాత్రిని పురస్కరించుకొని పండ్ల వ్యాపారులు సిండికేట్‌గా మారారు. పండ్ల ధరలను అమాంతం పెంచేసి.. వినియోగదారులకు చుక్కలు చూపించారు. తప్పదన్నట్లుగా ఉపవాస దీక్షలో ఉన్న భక్తులు ఫలాలను కొనుగోలు చేయలేక తప్పలేదు. పలు రకాల ఫ్రూట్స్ ధరలు ఇలా ఉన్నాయి. యాపిల్స్ నాలుగింటికి రూ.100 పలకగా.. డజన్ అరటి పండ్లు రూ.80కి విక్రయించారు. తర్బూజ కిలో రూ.40, అంగూర కిలో రూ.100, పైనాపిల్ ఒక్కటి రూ.80కి విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకున్నారు.

దైవచింతన అలవర్చుకోవాలి



మల్లన్న పల్లకీ సేవలో భక్తులు

దోమ: ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని సర్పంచ్ మామిళ్ల నర్సింహులు అన్నారు. శనివారం మండల పరిధిలోని ఊటుపల్లిలో మల్లన్న పల్లకీ సేవను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు మల్లయ్య మల్లన్న స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఆధ్యాత్మిక చింతన అలర్చుకున్నప్పుడే మానసిక ప్రశాంతత దక్కుతుందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ రాంచంద్రయ్య, గ్రామస్తులు జంగయ్య, అనంతయ్య, నరేందర్, అంజిలయ్య, గోపాల్, సత్యనారాయణ, రాఘవేందర్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఒత్తిడి దూరం

చేవెళ్ల ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: క్రీడలతో ఒత్తిడిని జయించవచ్చునని చేవెళ్ల ఎంపీపీ ఎం.విజయలక్ష్మి అన్నారు. మండల పరిధిలోని దేవుని ఎరవల్లి స్టేజీ సమీపంలో చేవెళ్లకు చెందిన అనంత్‌రెడ్డి మినీ క్రికెట్ గ్రౌండ్ ఏర్పాటు చేశారు. ఈ మైదానంను శనివారం సర్పంచ్ శైలజ, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎస్ఐ హయ్యూమ్‌తో కలిసి ఎంపీపీ ప్రారంభించారు. అంనతరం అత్తెల్లి శేఖర్‌రెడ్డి స్మారక క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యువతకు కావాల్సిన గ్రౌండ్‌ను అందుబాటులోకి తీసుకువచ్చిన అనంత్‌రెడ్డిని అభినందించారు. యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, కాంగ్రెస్ మండల మహిళా అధ్యక్షురాలు దేవర సమత, నాయకులు ఆగిరెడ్డి, రాంరెడ్డి, రాఘవేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న సత్తిరెడ్డి

షాబాద్: మండల పరిధిలోని మాచన్‌పల్లిలో హనుమాన్ ఆలయ పునఃనిర్మాణానికి ఎంపీటీసీ మాజీ సభ్యురాలు మోముల ప్రమీలసత్తిరెడ్డి రూ.30వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా సత్తిరెడ్డి మాట్లాడుతూ.. ప్రతీ ఒక్కరు దైవ చింతన అలవరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాచన్‌పల్లి సర్పంచ్ మహేందర్‌రెడ్డి, రమేశ్, రామస్వామిగౌడ్, పాండుగౌడ్, రాజశేఖర్‌రెడ్డి, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

శంభో శివ శంకర

మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తుల శివనామస్మరణతో ఆలయాల ప్రాంగణాలు మారుమోగాయి. ఉదయం నుంచే భక్తజనం దేవాలయాలకు తరలివచ్చి.. శివయ్యను దర్శించుకొని పూజలు చేయగా.. ఉపవాసంలో ఉన్న భక్తులు భక్తిశ్రద్ధలతో దీక్షవిరమణ చేసి ప్రత్యేకపూజలు నిర్వహించారు. పండుగ సందర్భంగా జాగరణ చేసేందుకు నిర్వాహకులు శైవక్షేత్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి, నెట్‌వర్క్



పరిగి: భక్తులతో నిండిన ఆలయ ప్రాంగణం



బషీరాబాద్: నీళ్లపల్లి ఏకాంబరి రామలింగేశ్వర ఆలయంలో దర్శనం కోసం క్యూలో భక్తులు



అనంతగిరి: బుగ్గలో అభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ దంపతులు



మోమిన్‌పేట: రామలింగేశ్వరస్వామి సన్నిధిలో..



దోమ: భక్తులకు పండ్లు అందజేస్తున్న యువకులు



బషీరాబాద్: దీపాలు వెలిగిస్తున్న రజినీరెడ్డి



నవాబ్‌పేట: ఎల్లకొండ శివాలయంలో ఎమ్మెల్యే యాదయ్య



ధారూరు: కపిలేశ్వరస్వామి ఆలయంలో..



బంట్వారం: బుగ్గ రామలింగేశ్వరుడి సన్నిధిలో..



కుల్కచర్ల: పాంబండ రామలింగేశ్వరుడిని దర్శించుకున్న డీసీసీబీ చైర్మన్ మనోహర్ రెడ్డి



కొడంగల్: దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం



తాండూరు టౌన్ : భద్రేశ్వరాలయంలో..

ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి

కుల్కచర్ల: పాంబండ ఆలయ అభివృద్ధికి తాము కృషిచేస్తామని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని శనివారం రామలింగేశ్వర ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ పరిధిలో కొనసాగుతున్న విశ్రాంతి భవన నిర్మాణ పనులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వం తరపున, వ్యక్తిగతంగా ఆలయ అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని చెప్పారు. ప్రసిద్ధి చెందిన ఆలయాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ రాములు, ఈఓ సుధాకర్, పరిగి మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, రైతుబంధు మండల అధ్యక్షుడు రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, నాయకులు శ్రీనివాస్, లక్ష్మయ్య, పుల్లయ్య, భాస్కర్, కృష్ణయ్య, పెద్ద నర్సింహులు, ఆంజనేయులు, పూజారులు దశరథం, పాండు తదితరులు పాల్గొన్నారు.



ఆలయ విశ్రాంతి భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్ రెడ్డి

దృష్టి సారించి.. లోపం గుర్తించి

- కంటివెలుగుతో పేదలకు లబ్ధి
- నేత్ర శిబిరాలకు అనూహ్య స్పందన

దౌల్తాబాద్: అంధత్వ నివారణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కంటివెలుగు కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తోంది. ఎంతో కాలంగా దగ్గరి చూపుతో ఇబ్బంది పడుతున్న వారు పరీక్షలు చేయించుకుని కళ్లజోడు, మందులు ఉచితంగా పొందారు. చూపు మెరుగుపరుచుకున్నారు. జనవరి 19న ప్రారంభమైన కార్యక్రమంతో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నారు.

దృష్టిలోపమే ఎక్కువగా...

మండలంలోని పీహెచ్‌సీ పరిధిలో 6,150 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో దగ్గరి చూపు సమస్యతో 1,350 మంది బాధ పడుతున్నట్లు గుర్తించి కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. దూరపు చూపుతో ఇబ్బంది పడుతున్న వారి కళ్లద్దాలకు ఆర్డర్ పెట్టారు. ఎక్కువ మంది దగ్గర దృష్టి లోపమే ఉన్నట్లు పరీక్షల్లో తేలింది. పీహెచ్‌సీ పరిధిలో రెండు బృందాల చొప్పున కంటిశిబిరాలలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. దీంతో అనేక మందిలో నేత్ర సమస్యలు వెలుగులోకి వస్తున్నాయి. శుక్లాల సమస్య ఉన్న వారి వివరాలు నమోదు చేసుకుని శస్త్ర చికిత్సలకు సమాచారం ఇస్తామని చెబుతున్నారు. ఇతర కంటి సమస్యలతో బాధపడేవారికి చుక్కల మందులు ఇస్తున్నారు.

ఆధార్‌తో అనుసంధానం..

ప్రతి ఒక్కరికీ ఆధార్‌తో ఆన్‌లైన్‌లో అనుసంధానం చేసి ఏ సమస్యతో బాధపడుతున్నారో.. ఎంత మోతాదులో కంటి ఇబ్బంది ఉందో కూడా యాప్‌లో వైద్య సిబ్బంది నమోదు చేస్తున్నారు. నిరుపేదలు దృష్టిలోపాలను అధికమించేందుకు శిబిరాలకు అధిక సంఖ్యలో వస్తుండడంతో చక్కని స్పందన లభిస్తోంది.



కంటి పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

> **నిర్లక్ష్యం చేయొద్దు**
>
> కంటి సమస్యలతో ఇబ్బంది పడేవారు నిర్లక్ష్యం చేయకుండా శిబిరాలలో పరీక్షలు చేయించుకోవాలి. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ.. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి. దగ్గరి దృష్టిలోపం ఉంటే అప్పటికప్పుడే కళ్లజోడు ఇస్తున్నాం.
>
> – రతన్‌లాల్, వైద్యాధికారి

రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం

మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి



ఆయుష్మాన్ భారత్ కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వరరెడ్డి

మొయినాబాద్: ఆయుష్మాన్ భారత్ యోజన పథకం కింద రూ.5లక్షల వరకు ఉచిత వైద్యం అందుతుందని చేవెళ్ల మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన మండల పరిధిలోని శ్రీరాంనగర్‌లో ఈ పథకంలో పేర్ల నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ఈ పథకంలో అర్హులుగా ఉండేందుకు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి సన్‌వల్లి ప్రభాకర్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంజర్ల ప్రకాశ్, నాయకులు మహిపాల్, మాధవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, మేన్‌రెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మల్చింగ్ సాగు.. లాభాలు బాగు

- కూరగాయ పంటలకు ఈ పద్ధతే మేలు
- పెట్టుబడి తక్కువ.. రాబడి ఎక్కువ
- తక్కువ నీటితో అధిక దిగుబడి
- కలుపును పూర్తిగా నివారించవచ్చు



ఎన్కేపల్లిలో టమాటా సాగుకు మల్చింగ్ వేసిన రైతు

మోమిన్‌పేట: పంటలకు తేమను నిలకడగా ఉంచేందుకు చేపట్టే ప్రక్రియను మల్చింగ్ అంటారు. వేసవిలో ఎండ తీవ్రత వలన ఉష్ణోగ్రతలు పెరిగి భూగర్భ జలాలు అడుగంటి పోతుంటాయి. పంటలకు సరిపడా నీరు అందక కూరగాయ పంటలు, తోటలు దెబ్బతినే ప్రమాదమూ లేకపోలేదు. అలాంటప్పుడు వీటిలో తేమ నిలకడగా ఉండాలంటే మల్చింగ్ పద్ధతిని పాటిస్తే మేలని ఉద్యానశాఖ అధికారులు తెలుపుతున్నారు. గతంలో ఎండిన ఆకులను అచ్ఛాదన చేసి మల్చింగ్ పద్ధతిని అవలంభించే వారని వెల్లడిస్తున్నారు.

సాగు విధానం..

మల్చింగ్ విధానంలో సాగు చేస్తే తప్పని సరిగా డ్రిప్ పరికరాలు ఉండాలి. మొదట భూమి గుల్లగా దున్ని బెడ్‌లను తయారు చేసుకోవాలి. అనంతరం బెడ్‌పై ప్లాస్టిక్ షీట్లను పరవాలి. మొక్కను నాటడం, విత్తుకునే దగ్గర చిన్న పాటి రంధ్రాన్ని చేయాలి. మల్చింగ్ విధానంలో ఒక్క సారి నీరు పెడితే నేలను బట్టి వారం నుంచి 15 రోజుల వరకు తడిని ఇవ్వాల్సిన అవసరముండదు. ఎరువులు నేరుగా మొక్కకే అందుతాయి. కలుపు తీత కొరకు పెట్టే పెట్టుబడి తగ్గుతుంది. మొక్క సాధారణ ఎదుగుదల కంటే 50శాతం రెట్టింపు పెరిగి దిగుబడులు అధికంగా వస్తాయి. మల్చింగ్ వేయడం పట్ల మొక్క మొదట్లో ఎప్పుడూ తేమగా ఉండటం వలన ఎరువులను అధిక శాతం తీసుకుంటుంది. వాతావరణం వలన వచ్చే తెగుళ్ల నివారించే అవకాశం ఉంది.

విత్తే ముందు..

మొక్కల మధ్య, వరుసల మధ్య గల దూరాన్ని బట్టి నాగలి సాలు మీదవేసుకొన్న బెడ్‌పై షీట్‌ను పరువాలి. రెండు వైపుల కొనలపై మట్టిని ఎగదోస్తే షీట్ గాలికి కొట్టుకు పోకుండా ఉంటుంది. డ్రిప్ ద్వారా నీరు పడుతున్నా విత్తుకునే దగ్గర చిన్న రంధ్రం చేసుకోవాలి. అక్కడే నారు వేయడం, విత్తు విత్తుకోవడం చేయాలి. ఇక కూరగాయ సాగులోనూ ఇదే పద్ధతిని పాటించవచ్చు. పందిరిపై తీగజాతి కూరగాయల సాగుకు ఎంతో మేలు చేస్తుంది.

ఉపయోగాలు..

మల్చింగ్ విధానంలో ఒక సారి నీరు పెడితే నేల స్వభావాన్ని బట్టి వారం నుంచి 15రోజుల వరకు నీరు అవసరముండదు. మొక్క వద్ద తేమ ఆరిపోకుండా ఉంటుంది. వేళ్లకు కావాల్సిన నీరు నిరంతరాయంగా అందుతుంది. ఎరువులు కూడా ఎక్కువ శాతం మొక్క తీసుకుంటుంది. దీంతో మొక్క ఆరోగ్యంగా ఎదుగుతుంది. కలుపును పూర్తిగా నివారించవచ్చు. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించవచ్చు. భూమిలో ఎప్పుడూ తేమ ఉండటం వలన నేల గుల్ల బారి, వేరు వ్యవస్థ వృద్ధి చెందుతుంది.

జాగ్రత్తగా..

మల్చింగ్ షీట్‌ను బలంగా లాగొద్దు. చల్లని వాతావరణం ఉన్నప్పుడు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వేయాలి. ఎక్కువ గాలి వీచే సమయంలో వేయొద్దు. 7–25 మైక్రాన్‌ల మందం కలిగిన మల్చింగ్ షీట్ ఒక పంట కాలం వరకు ఉంటుంది. మల్చింగ్ షీట్లు చాల రంగుల్లో ఉంటాయి. సీజన్‌లో వేసే పంటలను బట్టి షీట్లను ఎంపిక చేసుకోవాలి. ముఖ్యంగా షీట్లను పశువులు తొక్కకుండా చూసుకోవాలి.

> **రాయితీ ఇవ్వాలి**
>
> 
>
> గతంలో ప్రభుత్వం మల్చింగ్ సాగుకు 50శాతం సబ్సిడీ ఇస్తుండేది. కానీ మూడు సంవత్సరాల నుంచి పూర్తిగా రాయితీ ఎత్తి వేసింది. ఎకరాకు రూ.6,500ల సబ్సిడీ అందేది. ఇప్పుడు పూర్తిగా రైతులే భరించాల్సి వస్తోంది. ప్రభుత్వం మళ్లీ సబ్సిడీ ఇవ్వాలి. ధరలు పెరగడం వలన తక్కువ మైక్రాన్‌ల షీట్లు ఎకరాకు రూ.12వేల పైనే అవుతుంది.
>
> – పట్లోళ్ల రాంచంద్రారెడ్డి, రైతు, ఎన్కేపల్లి

నేడు మల్లన్న కల్యాణం

షాబాద్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ పంచాయతీకి అనుబంధ గ్రామం సాయిరెడ్డిగూడలో ఆదివారం మల్లన్న కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ సులోచన శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 12గంటలకు బోనాల ఊరేగింపు, మధ్యాహ్నం కల్యాణం, సాయంత్రం ఎడ్ల బండ్ల తిరుగుడు కార్యక్రమం ఉంటుందని చెప్పారు. ఉత్సవాలకు సీఐ గురువయ్యగౌడ్ ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఉద్యమంలో శేఖర్‌ది చురుకైన పాత్ర

షాద్‌నగర్: రాష్ట్ర సాధన పోరాటంలో కళాకారుడు పాపకంటి శేఖర్ పాత్ర మరువలేనిదని యువసత్తా యూత్ అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శనివారం యువ సత్తా యూత్ ఆధ్వర్యంలో పాపకంటి శేఖర్ 10వ వర్ధంతిని పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ.. శేఖర్ గజ్జకట్టి పాట పాడి మలిదశ ఉద్యమానికి ఊపిరి పోశాడన్నారు. ఈ కార్యక్రమంలో యువ సత్తా యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ ఇంటింటి ప్రచారం



ఇంటింటి ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయ సంఘం నేతలు

యాలాల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా తమ సంఘం అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డికి వేసే ఓటు పీఆర్‌టీయూ సంఘం గెలుపుగా ఉండబోతుందని ఆ సంఘం యాలాల మండల అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డితో కలిసి ఉపాధ్యాయుల ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర శాఖ ఆదేశానుసారం ఇంటింటి ప్రచారం చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూ సేవలు మరువలేనివన్నారు. ఉపాధ్యాయుల బదిలీ ఉత్తర్వులు, మహిళా ఉపాధ్యాయులకు సెలవులు, ఫ్యామిలీ పెన్షన్ తదితర సమస్యల పరిష్కారంలో సంఘం ఎనలేని కృషి చేసిందని వెల్లడించారు. మహబూబ్‌నగర్–రంగారెడ్డి–హైదరాబాద్ నియోజకవర్గాల ఎమ్మెల్సీ అభ్యర్థి చెన్నకేశవరెడ్డికి మొదటి ప్రాధాన్యతగా ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల ప్రధాన కార్యదర్శి యాదయ్యగౌడ్, ఉపాధ్యాయులు మహమ్మద్, పరమేశ్, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.